TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దిన పత్రిక

రూపాన్ని చూసి
మోసపోకు...
రూపాయిని చూసి
మురిసిపోకు...
రూపమైనా, రూపాయైనా
శాశ్వతం కాదు...
మనలోని మంచితనమే
శాశ్వతం...!!!

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 79 శనివారం 18-07-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు- 4 వేల :6.00/-

## కల్వకుంట్ల కవితకు

# పాలాభిషేకం

## తెలంగాణ మాధవక్క మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్



మునుగోడు నియోజకవర్గ ప్రజలతో కల్వకుంట్ల కవితను గజమాలతో సన్మానించిన ఇంచార్జ్ తెలంగాణ మాధవక్క



మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్ గా ఎన్నికైన తెలంగాణ మాధవక్క ను అభినందించిన కల్వకుంట్ల కవిత



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జ్ తెలంగాణ మాధవక్క



కల్వకుంట్ల కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్ తెలంగాణ మాధవక్క



**మునుగోడు న్యూస్ జూలై 17 నవ సంఘర్షణ**

తెలంగాణ రక్షణ సేన పార్టీ నుంచి అధినేత్రి కల్వకుంట్ల కవిత 23 నియోజకవర్గాలకు గాను ఇంచార్జ్ బాధ్యతలకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్ గా తెలంగాణ మాధవక్కను ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి బాధ్యతలు వచ్చిన సందర్భంగా పూలమాల వేయడం జరిగింది. అదేవిధంగా తదనంతరం తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత చిత్రపటానికి మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జిగా పూర్తి బాధ్యతలు స్వీకరించిన తెలంగాణ మాధవక్క ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిధులుగా తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర నాయకులు మేడి నరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్ తెలంగాణ మాధవక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నా పట్ల విశ్వాసంతో ఇంత గొప్ప పదవి బాధ్యతలు అప్పగించిన అధినేత్రి కల్వకుంట్ల కవితకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేస్తూ జీవితకాలం రుణపడి ఉంటానని హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తానని రానున్న అసెంబ్లీ ఎన్నికలలో , సాధారణ ఎన్నికలలో తమ వంతుగా పార్టీ కోసం నియోజకవర్గ ప్రజల కోసం కృషి చేస్తూ తెలంగాణ రక్షణ సేన పార్టీ యొక్క జెండాను ఎగురవేసి తీరుతానని మాట్లాడారు. ఈ యొక్క కార్యక్రమంలో ఆహ్వానితులు ఆలేరు నియోజకవర్గం నాయకులు కందాడి మణిపాల్ రెడ్డి, మునుగోడు నాయకులు బొజ్జ లక్ష్మి, పందుల జయసుధ, సునీతమ్మ, అంజలి, నర్సింగరాజు, వెంకటేష్, ప్రశాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు నియోజకవర్గం ప్రజలను కల్వకుంట్ల కవితకు కల్పించిన తెలంగాణ మాధవక్క



కల్వకుంట్ల కవితకు పుష్పగుచ్ఛం లఅందిస్తున్న తెలంగాణ మాధవక్క

# ఓటర్ జాబితాలో పేరు లేకుంటే పౌరసత్వం కోల్పోయినట్టు కాదు..




**న్యూఢిల్లీ జులై 17 నవ సంఘర్షణ**
ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) తర్వాత ఓటర్ల జాబితా నుంచి పేరును తొలగించినంత మాత్రాన పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని సుప్రీంకోర్టు శుక్రవారం మౌఖికంగా పునరుద్ఘాటించింది. పౌరసత్వాన్ని నిర్ణయించే అంతిమ అధికారం భారత ఎన్నికల సంఘానికి లేదని, అలాగే ఓటర్ల జాబితా నుండి పేరు తొలగించినంత మాత్రాన పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని బీహార్ సర్ తీర్పులో తాము స్పష్టం చేశామని సుప్రీంకోర్టు పేర్కొంది. సర్ తర్వాత ఓటర్ల జాబితాలో పేర్లు లేని వ్యక్తుల అప్పీళ్లను విచారించే అప్పిలేట్ ట్రిబ్యునళ్లలో విచారణ ప్రక్రియను క్రమబద్ధీకరించాలని కోరుతూ ప్రసేన్‌జిత్ బోస్ దాఖలు చేసిన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వీ మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. 19 అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఎదుట(వీటి నుంచి ఇద్దరు న్యాయమూర్తులు రాజీనామా చేశారు) 34 లక్షల అప్పీళ్లు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కోర్టుకు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 38,000 అప్పీళ్లపై మాత్రమే నిర్ణయం తీసుకున్నారని, వాటిలో కనీసం 70 శాతం అప్పీళ్లపై సానుకూలంగా తీర్పు వచ్చిందని ఆయన చెప్పారు. అప్పీళ్లు పెండింగ్‌లో ఉండగానే ఓటర్ల జాబితా నుండి పేర్లు కోల్పోయిన వారికి ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస్), అన్నపూర్ణ యోజన వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలను నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసిందని సీనియర్ న్యాయవాది పేర్కొన్నారు. అంతేగాకుండా అటువంటి వ్యక్తులకు కుల ధ్రువీకరణ పత్రాలను కూడా నిరాకరిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జస్టిస్ బాగ్చీ మాట్లాడుతూ బీహార్ సర్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, పౌరసత్వాన్ని నిర్ణయించే రాజ్యాంగబద్ధమైన అధికారం ఈసీఐకి లేదని పేర్కొన్నారు. పౌరసత్వంపై సందేహాల కారణంగా ఒక వ్యక్తి పేరును ఓటర్ల జాబితా నుండి తొలగించినపుడు ఆ వ్యక్తి పౌరసత్వ హోదాను నిర్ధారించాలని కోరుతూ కేంద్రానికి దరఖాస్తు చేయాల్సిన బాధ్యత ఈసీఐపై ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దీనికి సీనియర్ న్యాయవాది స్పందిస్తూ ఓటర్ల జాబితా నుండి పేర్లు తొలగించబడిన వారికి సర్ ప్రక్రియ తర్వాత ప్రభుత్వం ఇతర ప్రయోజనాలను కూడా నిరాకరిస్తుందని ఎవరూ ఊహించలేదని చెప్పారు. ఆ విషయం న్యాయమూర్తుల దృష్టికి వచ్చిందని తాను భావించడం లేదని, ఎందుకంటే అలా జరిగి ఉంటే ఈ అంశంపై విచారణ జరుగుతున్నంత కాలం పౌరులకు లభించే ఇతర పౌర హక్కులకు భంగం కలిగించవద్దని ఒక వాక్యాన్ని తీర్పులో జోడించి ఉండేవారని ఆయన పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ మా తీర్పు స్పష్టంగా ఉంది. ఆర్టికల్ 9,10,11,12 పరిధిలో పౌరసత్వ హోదా విషయంలో ఈసీఐ ఒక రాజ్యాంగబద్ధమైన అధికారం కలిగిన సంస్థ కాదు. ఓటర్ల జాబితాలపై ఈసీఐకి నియంత్రణ ఉంటుంది. ఒక వ్యక్తిని అందులో చేర్చకూడదని అది నిర్ణయించవచ్చు. అయితే అలా చేయడం వల్ల ఆ వ్యక్తి పౌరసత్వ హోదాను కోల్పోరు. అందుకే, దీనికి సంబంధించి తగిన బాధ్యతను మేము నిర్దేశించాము అని స్పష్టం చేశారు.

# మైనర్ భవిష్యత్తు కాపాడిన శక్తి బృందం..

**-ఆదోని కానిస్టేబుళ్లకు**
**ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసా పత్రాలు**



**కర్నూలు రూరల్ బ్యూరో, జులై 17 నవ సంఘర్షణ**
బాల్య వివాహాన్ని అడ్డుకుని ఓ మైనర్ బాలిక భవిష్యత్తును కాపాడిన ఆదోని శక్తి బృందం పోలీసు కానిస్టేబుళ్లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయులను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. పిల్లల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు.

**సమాచారం అందగానే వేగంగా స్పందన**
ఇటీవల ఆదోని మండలం ఇస్వి గ్రామానికి చెందిన ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికకు బాల్య వివాహం జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం అందడంతో శక్తి బృందం కానిస్టేబుళ్లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయులు వెంటనే స్పందించారు. ఐసీడీఎస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖ, గ్రామ సచివాలయ అధికారులతో సమన్వయం చేసుకుని సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.

**కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్**
బాలిక కుటుంబ సభ్యులకు అధికారులు, పోలీసులు కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, దీనివల్ల బాలిక విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఉంటాయని వివరించి అవగాహన కల్పించారు. దీంతో కుటుంబ సభ్యులు బాల్య వివాహాన్ని విరమించుకోవడంతో మైనర్ బాలిక భవిష్యత్తు రక్షితమైంది.

**సమాచారం వెంటనే ఇవ్వాలి: ఎస్పీ**
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు, డయల్--112కు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇటువంటి ఘటనలపై పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**సేవలకు ప్రత్యేక అభినందనలు**
పిల్లల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసి బాల్య వివాహాన్ని అడ్డుకోవడంలో కీలక పాత్ర పోషించిన శక్తి బృందం కానిస్టేబుళ్లు కె. రాజేశ్వరి, ఎస్. వీరాంజనేయులతో పాటు సహకరించిన ఐసీడీఎస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖ, గ్రామ సచివాలయ సిబ్బంది సేవలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ మస్తాన్ వలి పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి..

**-ఏడీఏకు వినతిపత్రం సమర్పించిన ఎంపీఈవోలుసమాన పనికి**
**-సమాన వేతనం, పెండింగ్ జీతాల విడుదలకు డిమాండ్**



**ఉరవకొండ రూరల్, జులై 17 నవ సంఘర్షణ**
వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న బహుళ ప్రయోజన విస్తరణ అధికారులకు (ఎంపీఈవోలు) ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం ఉరవకొండ వ్యవసాయ డివిజన్‌లో పనిచేస్తున్న ఎంపీఈవోలు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉరవకొండ వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకుల (ఏడీఏ) కార్యాలయంలో ఏడీఏ సత్యనారాయణకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఉరవకొండ వ్యవసాయ డివిజన్ సంఘం అధ్యక్షుడు బూదగవి గంగన్న, ఉపాధ్యక్షురాలు బండి హేమ మాట్లాడుతూ, గత 12 ఏళ్లుగా గ్రామాల్లో బహుళ ప్రయోజన విస్తరణ అధికారులుగా సేవలందిస్తున్నామని తెలిపారు. నెలకు కేవలం రూ.12 వేల వేతనం, రూ.3 వేల ఇన్సెంటివ్ మాత్రమే అందుతున్నాయని పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం కింద నెలకు రూ.35 వేల వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలని కోరారు. విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ట్రెజరర్ మోహన్ నాయక్‌తో పాటు పలువురు బహుళ ప్రయోజన విస్తరణ అధికారులు (ఎంపీఈవోలు) పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో ర్యాలీలు, ధర్నాలకు కీలక ఆంక్షలు




**శ్రీ సత్యసాయి,జులై 17 నవ సంఘర్షణ**
పుట్టపర్తిలో గణేష్ కూడలి నుంచి విద్యాగిరి ఆర్చ్ వరకు ఎలాంటి ర్యాలీలు, ధర్నాలు నిర్వహించేందుకు అనుమతి లేదని పట్టణ సీఐ యువరాజు స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, సత్యసాయి భక్తులు, విద్యార్థులు అధిక సంఖ్యలో సంచరించే ఈ ప్రాంతంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గణేష్ కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిత్యం భక్తులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుండటంతో ఆ ప్రాంతంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. అత్యవసరంగా వినతిపత్రం సమర్పించాల్సి వచ్చినా, ఐదుగురికి మాత్రమే కలెక్టరేట్‌లో అర్జీ అందజేసేందుకు పోలీసు శాఖ అనుమతి ఇస్తుందని చెప్పారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు ఆర్డీఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధర్నా చౌక్‌ను వినియోగించాలని సూచించారు.

**మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు..**
అదేవిధంగా గణేష్ కూడలి నుంచి ప్రశాంతి మందిరం మీదుగా సత్యమ్మ కూడలి వరకు భారీ వాహనాలు, షేర్ ఆటోలకు అనుమతి లేదని తెలిపారు. ఈ వాహనాలు చిత్రావతి బైపాస్ మార్గాన్ని వినియోగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని సీఐ యువరాజు కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, రోడ్డు భద్రత నిబంధనలు పాటించి భక్తులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కేదార్‌నాథ్‌లో విరిగిపడ్డ కొండచరియలు



**న్యూఢిల్లీ జులై 17 నవ సంఘర్షణ**
కుండపోత వర్షాల కారణంగా కేదార్‌నాథ్ పాదయాత్ర మార్గంలో గౌరీకుండ్ కు వెళ్లే దారిలో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా అధికారులు కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రస్తుతం శిథిలాలను తొలగించే పనులు అధికారులు చేపట్టారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి, ప్రయాణ మార్గం సురక్షితమని తెలిపిన తరువాతే యాత్ర ప్రారంభమవుతుంది. పనులు పూర్తయ్యేవరకు యాత్రికులు అప్రమత్తంగా ఉండాలని రుద్రప్రయాగ్ జిల్లా విపత్తు నిర్వహణ అధికారి రాజ్వార్ సూచించారు. అనవసర ప్రయాణాలు మానుకొని, పరిపాలన యంత్రాంగం జారీ చేసిన సూచనలను పాటించాలని కోరారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినందున భక్తులు కేదార్‌నాథ్ యాత్రను కొన్ని రోజులు వాయిదా వేసుకుంటే మంచిదని తెలిపారు.

# పట్టాలెక్కిన తొలి హైడ్రోజన్ రైలు.




**. జింద్-సోనిపట్ మధ్య పరుగులు**

**చండీఘర్ జులై 17 నవ సంఘర్షణ**
దేశంలో తొలి హైడ్రోజన్ ఆధారిత రైలును శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించారు. హర్యానాలోని జింద్-సోనిపట్ మార్గంలో నార్తర్న్ రైల్వే ఆధ్వర్యంలో 89 కిలోమీటర్ల పరిధిలో ఈ రైలు నడుస్తుంది. ఈ రైలు హైడ్రోజన్ ఇంధన సెల్స్‌ను వినియోగించుకుని పవర్‌ను సృష్టించుకుని నడుస్తుంది. ఈ రైలు ప్రారంభంతో ప్రపంచంలో హైడ్రోజన్ రైళ్లు కలిగిన యూఎస్, చైనా, జపాన్, జర్మనీ దేశాల సరసన భారత్ చేరింది. 10 బోగీల హైడ్రోజన్ ఇంధన సెల్ ఆధారిత రైలు ఇది.

# గిగ్ వర్కర్లకు కొత్త పెన్షన్ స్కీమ్!

**ఈపీఎఫ్‌వో 3.0లో భాగంగా ప్రతిపాదన**




**న్యూఢిల్లీ జులై 17 నవ సంఘర్షణ**
సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కొత్త కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం తీసుకురాబోతున్నట్టు తెలుస్తోంది. కార్మికులు, యజమానులు ఇచ్చే వాటాలను సేకరించి దీర్ఘకాలిక ప్రభుత్వ హామీ ఉన్న సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టి ప్రతి సంవత్సరం అందులో వడ్డీని జమ చేస్తారు. గిగ్ వర్కర్లకు 60 ఏండ్లు వచ్చాక ఈ పథకంలో ప్రతిపాదించిన టార్గెట్ రిటైర్మెంట్ సమ్‌ను అప్పటికి అమల్లో ఉన్న అన్యుటీ, వడ్డీ రేట్ల ఆధారంగా నెలవారీ పెన్షన్‌గా సమకూరుస్తారని కేంద్రానికి చెందిన ఓ అధికారి వెల్లడించారు. ఈ కొత్త పథకాన్ని ఈపీఎఫ్‌వో చేపట్టే తదుపరి సంస్కరణలలో భాగంగా అమలు చేయాలని చూస్తోంది. ప్రస్తుతం ఉద్యోగ పెన్షన్ పథకంలో లేని కార్మికులకు కూడా పెన్షన్ భద్రత కల్పించడమే దీని ప్రధాన లక్ష్యం. సింగపూర్ లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఉన్న రిటైర్మెంట్ నిధుల విధానాలను అధ్యయనం చేసి అందులో అత్యుత్తమ పద్ధతులను అమలు చేయాలని చూస్తున్నట్టు సదరు అధికారి తెలిపారు.

# బ్రిటన్ తదుపరి ప్రధానిగా బర్న్‌హామ్.. లేబర్ పార్టీ నేతగా ఎన్నిక

**20న ప్రధానిగా బాధ్యతలు**



**లండన్, జులై 17 నవ సంఘర్షణ**
యూకేలో లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హామ్ ఎన్నికయ్యారు. సోమవారం బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టడానికి ముందు మధ్య లండన్‌లో జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో మెకర్‌ఫీల్డ్ ఎంపీ బర్న్‌హామ్ పార్టీ నాయకుడిగా ఖరారయ్యారని బీబీసీ నివేదించింది. కాగా, లేబర్ పార్టీ నేతగా జరిపిన తొలి ప్రసంగంలో బర్న్‌హామ్ మాట్లాడుతూ కీర్ స్టార్మర్ వేసిన పునాదులపై పార్టీని నిర్మించి దానిని నడిపించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. స్టార్మర్ నాయకత్వంలో పార్టీ అత్యంత ఘోర పరాజయం నుంచి అత్యుత్తమ విజయం వైపు సాగిందని ఆయన పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**






**దేవరకొండ జులై 17 నవ సంఘర్షణ**
దేవరకొండ నియోజకవర్గం, చింతపల్లి మండల కేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందని, ప్రతి అర్హ కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్అన్నారు. చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఉపసర్పంచ్ రహేనా బేగం -- సిద్ధిక్ బాబా దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు.ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఒక ఆత్మగౌరవ చిహ్నమని, ఆ గౌరవాన్ని పేదలకు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గతంలో ఎన్నో కుటుంబాలు సొంతింటి కోసం ఎదురు చూసినా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వారి కలలు నిజమవుతున్నాయని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహకారంతో నాణ్యమైన ఇళ్లు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో భూముల రీ-సర్వే అవగాహన సదస్సు




**దేవరకొండ జులై 17 నవ సంఘర్షణ**
దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండల పరిధిలోని వర్ధమానిగూడెం గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భూముల రీ-సర్వే అవగాహన సదస్సులో టి పి.సి.సి. సభ్యులు ఢ పి .ఎ . సి. ఎస్. చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొండమల్లేపల్లి ఎం.ఆర్.ఓ. ఎం. నరేందర్ మండల గిర్దావర్, ఆర్.ఐ. రామాంజనేయులు మండల సర్వేయర్ విజయలక్ష్మి కొండమల్లేపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసార్ల వెంకటేశ్వర్లు మండల గ్రామ పాలనా అధికారి మొహమ్మద్ హమీద్ , పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ ప్రణిత మంతు నాయక్ ,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్ పాల్గొని భూముల రీ-సర్వే ప్రక్రియ, దాని ప్రయోజనాలు, రైతులు మరియు భూ యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.
అలాగే గ్రామస్తులు కటి వెంకన్న, ఇస్లావత్ శ్రీను, ఇస్లావత్ శ్రీకాంత్, కటి విరయ్య, ఎస్. సైదులు, కేతావత్ శంకర్, ఇస్లావత్ రాములు, మూడవత్ మంతు, ఇస్లావత్ లక్ష్మ, మూడవత్ రమేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సర్ ప్రక్రియను ప్రతి ఓటరు తప్పనిసరిగా సమర్థించాలి

**- డా. దూదిపాల వేణుధర్ రెడ్డి**




**దేవరకొండ జులై 17 నవ సంఘర్షణ**
తెలంగాణలో జరుగుతున్న సర్ ప్రక్రియను ప్రతి ఓటరు బాధ్యతగా భావించి విజయవంతం చేయాలని టి పి సి . సి సభ్యులు చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి పి.ఎ.సి. సి.పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వర్ధమానిగూడెం, ఫకీర్‌పురం, చెన్నెన్నిపల్లి గ్రామాలలో పర్యటిస్తూ, బిఎల్ ఓ, బి.ఎల్ ఎ. లతో కలిసి సరప్రక్రియను పరిశీలించారు. ఓటరు నమోదు, వివరాల సవరణ, అవసరమైన పత్రాల ధృవీకరణ వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేస్తూ, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా. దూదిపాల వేణుధర్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్ ప్రక్రియలో పాల్గొని, తన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చూసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటు ఎంతో విలువైనది" అని పేర్కొన్నారు

# విద్వేషపూరిత పోస్టులు చేస్తే కఠిన చర్యలు

**ఎస్పీ సునీల్ షోరాణ్**



**నందికొట్కూరు, జులై 17 నవ సంఘర్షణ**
సామాజిక మాధ్యమాల్లో కులాలు, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు, చిత్రాలు, వ్యాఖ్యలు ప్రచురిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ హెచ్చరించారు. ఎవరి మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించినా ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో, జూపాడు బంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో సామాజిక మాధ్యమంలో మతపరమైన అభ్యంతరకర కంటెంట్‌ను పోస్టు చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సంబంధిత సెక్షన్లతో పాటు సమాచార సాంకేతిక చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా నిందితుడి వద్ద నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీల్ షోరాణ్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, మత సామరస్యానికి భంగం కలిగించే లేదా ఇతరుల మనోభావాలను దెబ్బతీసే పోస్టులకు దూరంగా ఉండాలని ప్రజలకు, ముఖ్యంగా యువతకు సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. నందికొట్కూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతలు, మత సామరస్యాన్ని కాపాడేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉంటారని, ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో మెలగాలని కోరారు.

## ఈనెల ఆఖరి వరకు గడువు పెంచాలి : ఏడిఏ



**ఉరవకొండ రూరల్, జులై 17 నవ సంఘర్షణ**
ప్రీమియం చెల్లించడానికి ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచాలని ఉరవకొండ వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు సత్యనారాయణ బ్యాంక్ అధికారులకు కోరారు. శుక్రవారం పట్టణంలోని కెనరా బ్యాంక్ మేనేజర్ శివ దుర్గ ప్రసాద్, బ్యాంక్ అధికారులతో ఏ డి ఏ సత్యనారాయణ చర్చించారు. ఈ సందర్భంగా ఏడిఏ సత్యనారాయణ మాట్లాడుతూ పంటల భీమాపై పునర్వ్యవస్థీకరిం చిన వాతావరణపంటల బీమా మరియు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం వాటి క్రింద నమోదైన వివిధ పంటలు, రైతులు చెల్లించవలసిన ప్రీమియం, ఈనెల 31 తేదీ వరకు గడువు ఇవ్వాలన్నారు.పంట ఋణం పొందని నాన్ లోని రైతులు వారు వేసిన పంటను బట్టి ప్రీమియంను కామన్ సర్వీస్ సెంటర్, మీసేవ కేంద్రాల్లో ఈనెల 31 తేదీలోగా ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, స్వయం ధ్రువీకరణ పత్రం సమర్పించి చెల్లించాలన్నారు. పంట వేసిన ప్రతి రైతు భీమా పొందాలంటే, ఈ పంట నమోదు తప్పక చేసుకోవాలన్నారు. కంది ఒక ఎకరాకు 80 రూపాయలు, మిరప ఒక ఎకరాకు 576 రూపాయలు, జొన్నలు ఒక ఎకరాకు 84 రూపాయలు, మొక్కజొన్న ఒక ఎకరాకు 132 రూపాయలు, వరి పంట ఒక ఎకరాకు 164 రూపాయలు, ఆముదం ఒక ఎకరాకు 80 రూపాయల ప్రకారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాసులు, వ్యవసాయ విస్తరణ అధికారి భరత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసం తొలి బోనాల జాతరలో కుమ్మరుల భారీ ర్యాలీ





**- కనకాల కట్ట మైసమ్మ అమ్మవారికి 601 బోనాల సమర్పణ.**

**ఎల్ బి నగర్ జులై 17 నవ సంఘర్షణ**
తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘంటీ ఆర్ కే ఎస్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం తొలి బోనాల జాతర గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. జగదీష్ మందిర్ నుండి ట్యాంక్‌బండ్ మీదుగా సుమారు 3 వేల మంది కుమ్మరులు, మహిళలు, యువతతో భారీ ర్యాలీ నిర్వహించి, దాదాపు 2 కిలోమీటర్లు నడిచి శ్రీ కనకాల కట్ట మైసమ్మ అమ్మవారికి 601 బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు నాయకత్వంలో జరిగింది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, బోనాల కన్వీనర్ ఆడాల గణేష్, మహిళా కన్వీనర్ మల్లెల ఉషారాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, బీసీ నాయకులు జాజుల శ్రీనివాస్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఈనాడు సీనియర్ జర్నలిస్ట్ ఆకారం వల్లేశం తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమ్మరుల సమస్యలు, డిమాండ్లను సంఘం నాయకులు మంత్రులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చిస్తామని వారు హామీ ఇచ్చారు. ర్యాలీలో పాల్గొన్న మహిళలు, కుమ్మర సంఘ సభ్యులు తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అలాగే స్టీల్, ఇత్తడి పాత్రలతో కాకుండా సంప్రదాయ మట్టి పాత్రలతోనే బోనం సమర్పించడం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మట్టి పాత్రల వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం తెలంగాణ సంప్రదాయ సంస్కృతిని చాటిచెప్పడంతో పాటు కుమ్మరుల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

# మిస్ తెలంగాణ యూనివర్స్- 2026 విజేత హసిత నారాయణ భట్ట




**దిల్‌సుఖ్‌నగర్, జులై 17 నవ సంఘర్షణ**
దిల్‌సుఖ్‌నగర్‌లోని లక్మే అకాడమీ పవర్డ్ బై అప్‌టెక్ లో నిర్వహించిన ప్రత్యేక "మీట్ అండ్ గ్రీట్" కార్యక్రమంలో పాల్గొని 100 మందికి పైగా విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు.ఈ కార్యక్రమంలో హసిత తన సాధారణ నేపథ్యం నుంచి రాష్ట్ర స్థాయి అందాల పోటీలో విజేతగా ఎదిగిన ప్రయాణాన్ని పంచుకుంటూ, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నిరంతర అభ్యాసం విజయానికి మూల సూత్రాలని వివరించారు. ముఖ్యంగా యువతులు తమ లక్ష్యాలను ధైర్యంగా సాధించాలని, విద్య ద్వారానే నిజమైన సాధికారత సాధ్యమని పేర్కొన్నారు. అందాల రంగం, ఫ్యాషన్ పరిశ్రమలో రోజురోజుకూ పెరుగుతున్న అవకాశాలను వివరించిన హసిత, విద్యార్థులు సృజనాత్మకత, వ్యాపార దృక్పథం, ఔత్సాహికతతో కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అప్‌టెక్ లిమిటెడ్ గ్లోబల్ రిటైల్ బిజినెస్ చీఫ్ సందీప్ మాట్లాడుతూ.. "లక్మే అకాడమీలో విద్యార్థులకు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కూడా అందిస్తున్నామని అన్నారు.హసిత నారాయణభట్ట వంటి విజయవంతమైన వ్యక్తులతో విద్యార్థులను అనుసంధానం చేయడం ద్వారా వారికి మరింత ప్రేరణ లభిస్తుందని, వారు భవిష్యత్తులో అందాల రంగంలో నాయకులుగా ఎదగడానికి ఇది దోహదపడుతుంది" అన్నారు. లక్మే అకాడమీ దిల్‌సుఖ్‌నగర్ సెంటర్ డైరెక్టర్ మాధవ రెడ్డి మాట్లాడుతూ, "హసిత నారాయణ భట్టను మా అకాడమీకి ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందని,. ఆమె విజయగాథ విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని అన్నారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, పరిశ్రమ అనుభవాన్ని అందించడమే మా లక్ష్యమని అన్నారు.

### స్నేహితుల సర్‌ప్రైజ్‌తో

# సమంత సీమంతం..

### కుటుంబ వేడుకలో ఎమోషనల్ మూమెంట్స్ వైరల్!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రస్తుతం తన వ్యక్తిగత జీవితంలో హ్యాపీ మూమెంట్స్‌ని ఎంజాయ్ చేస్తుంది. ఇటీవల సమంత తన భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సన్నిహిత కుటుంబ వివాహ వేడుకకు హాజరయ్యారు. పెళ్లి వేడుకకు వెళ్లిన ఈ జంటకు అక్కడ స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ప్లాన్ చేశారు. సమంత గర్భిణిగా ఉండటంతో ఎలాంటి హడావిడి లేకుండా అక్కడే చిన్నపాటి సీమంతం వేడుక నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సమంతకు కొత్త దుస్తులు అందించి, స్వీట్లు తినిపించి ఆశీర్వదించారు. ఈ సర్‌ప్రైజ్‌ను అస్సలు ఊహించని సమంత ఒక్కసారిగా ఎమోషనల్ అయి స్నేహితుల ప్రేమాభిమానాలకు ఆనందం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్ నిడిమోరు కూడా ఈ ప్రత్యేక క్షణాలను ఎంతో ఆస్వాదించినట్లు సమాచారం. ఈ వేడుకలో సమంత, రాజ్ నిడిమోరు ఒకే రంగు మెరూన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించి అందరి దృష్టిని ఆకర్షించారు. ప్రెగ్నెన్సీ గ్లోతో మెరిసిపోతున్న సమంత, కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి గడిపిన ఆప్యాయ క్షణాలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ఫొటోలు బయటకు రావడంతో అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సమంత జీవితంలో ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొద్ది రోజులుగా సమంత గర్భధారణపై వార్తలు వినిపిస్తుండగా, ఇటీవల జరిగిన 'మా ఇంటి బంగారం' విజయోత్సవ కార్యక్రమంలో ఆమె బేబీ బంప్‌తో కనిపించడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఆమె షూటింగ్‌లకు విరామం ఇచ్చి కుటుంబంతో కలిసి ఈ ప్రత్యేక సమయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తోంది. నటిగా వరుస విజయాలతో కెరీర్‌లో కొత్త అధ్యాయం ప్రారంభించిన సమంతకు, ఇప్పుడు వ్యక్తిగత జీవితంలోనూ కొత్త ఆనందం చేరువైంది. కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య జరిగిన ఈ సీమంతం వేడుక ఆమె జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోనుంది. అభిమానులు కూడా తల్లి కాబోతున్న సమంతకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నారు.

# అజిత్ సినిమా కీలక పాత్రలో కయాదు లోహర్ ?



అనతికాలంలోనే తారపథంలో దూసుకుపోతున్నది అస్సామీ సోయగం కయాదు లోహర్. డ్రాగన్, ఫంకీ చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ భామ ప్రస్తుతం 'ది ప్యారడైజ్'లో నాని సరసన కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఆమె తమిళంలో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో అజిత్ 64వ సినిమా కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనికి అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో కయాదు లోహర్ నటించనున్నట్లు తెలిసింది. కథాగమనంలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఇదిలావుండగా సూర్య 48వ చిత్రంలో కూడా కయాదులోహర్ నాయికగా నటిస్తున్నది.



# క్వాలిటీ కథలకే ఓటేసిన కృతి సనన్..

కెరీర్ మొదలుపెట్టి పుష్కరం దాటిపోయింది. కావాల్సినంత డబ్బులు, రావాల్సినంత పేరు వచ్చేసాయి.. అయినా కూడా ఇప్పటికీ పిచ్చి పిచ్చి సినిమాలెందుకు చేయడం అంటున్నారు ఓ హీరోయిన్. వయసైపోతోందని ఏది పడితే అది చేయకుండా.. కెరీర్‌పై ఫుల్ ఫోకస్ పెడుతున్నారు. క్వాంటిటీ కాదు క్వాలిటీయే ముఖ్యం అంటున్నారామె. మరి ఇంతకీ ఎవరా ముద్దుగుమ్మ..? పుష్కరం కింద నేనొక్కడినేతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన బ్యూటీ కృతి సనన్.. ఆ తర్వాత హిందీలో టాప్ హీరోయిన్‌గా మారిపోయారు. అప్పట్లో ఖాళీగా ఉండకూడదని ఏ ఛాన్స్ వస్తే అది చేసుకుంటూ వెళ్లిన ఈ భామ.. ఇప్పుడు మాత్రం కథ నచ్చితేనే డేట్స్ ఇస్తానంటూ గట్టిగా చెబుతున్నారు. బాలీవుడ్‌లో తనకంటూ ఒక స్పెషల్ క్రేజ్ సొంతం చేసుకుని కాన్ఫిడెంట్‌గా దూసుకుపోతున్నారీమే. వచ్చిన ప్రతి సినిమాను ఓకే చేసే రోజులకి గుడ్‌బై చెప్పేసిన ఈ బ్యూటీ.. ఇప్పుడు రూట్ మార్చి క్వాలిటీకే ఓటేస్తోంది. తనకు నిజంగా కిక్ ఇచ్చే కథలనే ఎంచుకుంటూ.. రిజల్ట్ గురించి టెన్షన్ పడకుండా బిందాస్‌గా అడుగులు వేస్తున్నారు. ప్రస్తుతం తన కెరీర్, లైఫ్‌లో ఎక్సైటింగ్ ఫేజ్ నడుస్తోందని తెలిపారీమే. ఇక్కడి దాకా వచ్చినందుకు ఎంతో హ్యాపీగా ఉందని ఫుల్ జోష్‌లో చెప్తున్నారు కృతి. పర్సనల్ లైఫ్‌లోనూ కృతిసనన్ తీసుకున్న ఓ నిర్ణయం హాట్ టాపిక్‌గా మారిందిప్పుడు. వయసైపోతుందేమో, త్వరగా పెళ్లి చేసుకోవాలేమో అనే టెన్షన్ లేకుండా.. కెరీర్‌పై ఫోకస్ చేయడానికే ఎగ్స్ ఫ్రీజ్ చేయించుకున్నట్లు ఓపెన్‌గా చెప్పారు. ఏ ప్రెషర్ లేకుండా ఫుల్ ఫ్రీడమ్‌తో కెరీర్‌ను ఎంజాయ్ చేస్తున్నారీమే. మొత్తానికి ఈ టైమ్‌లో తనకు క్వాంటిటీ కాదు కథల్లో క్వాలిటీ కావాలంటున్నారు కృతి.

### NBK111'

# రిలీజ్ డేట్ ఫిక్స్?

### ప్రభాస్ 'ఫౌజీ'తో క్లాష్ తప్పించుకునే ప్లాన్‌లో బాలయ్య టీమ్!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, మాస్ చిత్రాల స్పెషలిస్ట్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ చీదీఖ111 పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో సినిమాపై భారీ హైప్ ఏర్పడింది. ముఖ్యంగా బాలయ్య స్టైలిష్ మాస్ లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రంలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని కొత్త స్టైలిష్ అవతారంలో గోపీచంద్ మలినేని చూపించబోతున్నారని గ్లింప్స్ ద్వారానే స్పష్టమైంది. పవర్‌ఫుల్ యాక్షన్‌తో పాటు స్టైలిష్ ప్రెజెంటేషన్‌కు ప్రాధాన్యం ఇస్తూ సినిమాను రూపొందిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఈ సినిమా కోసం బాలయ్య అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, ఇప్పుడు 'చీదీఖ111' విడుదల తేదీ గురించిన చర్చ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని డిసెంబర్ 25 క్రిస్మస్ సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఈ సినిమాను డిసెంబర్ తొలి వారంలోనే విడుదల చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'ఫౌజీ' డిసెంబర్ 3న విడుదల కానుందని అధికారికంగా ప్రకటించడంతో మేకర్స్ తమ వ్యూహాన్ని మార్చుకున్నట్లు సమాచారం. ప్రభాస్ సినిమాతో పోటీ పడకుండా, క్రిస్మస్ హాలిడే సీజన్‌ను లక్ష్యంగా చేసుకుని డిసెంబర్ చివరి వారంలో విడుదల చేస్తే కలెక్షన్లకు మరింత అనుకూలంగా ఉంటుందని చిత్రబృందం భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. క్రిస్మస్ సెలవులు, అనంతరం న్యూ ఇయర్ హాలిడేస్ కలిసి రావడం వల్ల సినిమాకు లాంగ్ రన్ దక్కే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంలో బాలకృష్ణ మరోసారి తన మాస్ పవర్‌ను చూపించేందుకు సిద్ధమవుతున్నారు. గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్, బాలయ్య స్క్రీన్ ప్రెజెన్స్, హై వోల్టేజ్ ఎలివేషన్ సీన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. అయితే డిసెంబర్ 25 విడుదల తేదీపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రిలీజ్ డేట్ ఖరారైతే, ఈ క్రిస్మస్ సీజన్‌లో బాలయ్య అభిమానులకు మరో భారీ సినీ పండుగ ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# గుండెజబ్బులు ఉన్నవాళ్లు సినిమాకు రావద్దు!



ఎస్‌బీకే ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై, రేగుల నీరజరాణి సమర్పణలో, ఆర్‌ఎన్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ ప్రొడక్షన్ ఆధ్వర్యంలో దర్శకుడు, నిర్మాత ఎస్కే బషీద్ తెరకెక్కించిన హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'అమెన్'. ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సినిమా గురించి ఎస్కే బషీద్ మాట్లాడు తూ "ఇప్పటివరకు వచ్చిన హారర్ సినిమాల ట్రెండ్‌ను పూర్తిగా మార్చేలా 'అమెన్' రూ పొందించాం. సరికొత్త సస్పెన్స్, భయానక ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను థ్రిల్ చేయబోతు న్నాం. ఈ సినిమా ఎంత భయపెడుతుందో చెప్పలేం... గుండె జబ్బులు ఉన్నవాళ్లు థి యేటర్‌కు రావద్దు. ఒంటరిగా కూర్చుని చూసే ధైర్యం ఎవరికీ ఉండదు. ఇది కుటుంబ సమేతంగా థియేటర్లలో ఆస్వాదించాల్సిన ఒక భయానక చిత్రం"అని అన్నారు.